## క్లుప్తంగా

### 12న చలో కలెక్టరేట్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న యోగేశ్వరరావు, ఆదివాసీలు

**సారవకోట:** ఈ నెల 12న ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కరపత్రాన్ని మండల కేంద్రంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు సోమవారం ఆవిష్కరించారు. జలుమూరు మండలంలోని ఎస్టీ మాకివలస గ్రామానికి చెందిన ఆదివాసీల భూ సమస్య పరిష్కారం కోసం నిరసన తెలియజేస్తామన్నారు. జిల్లాలోని ఆదివాసీలందరినీ ఏకం చేస్తామని తెలిపారు. ఆదివాసీల సమస్యను పరిష్కరించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. పాపారావు, హరీష్, సూరపు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### కుల గణన వివరాలు బయట పెట్టాలి



రాజాపు హైమావతి

**నరసన్నపేట:** గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టగా తీసుకుని చేపట్టిన కుల గణన వివరాలను కూటమి ప్రభుత్వం బయట పెట్టాలని పొందర, కూరాకుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రాజాపు హైమావతి డిమాండ్ చేశారు. నరసన్నపేటలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. చాలా కాలంగా ప్రభుత్వాలు కుల గణన చేపట్టలేదని, సాహసం చేసి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారన్నారు. ఆ వివరాలను ప్రస్తుత ప్రభుత్వం గోప్యంగా ఉంచుతుందన్నారు. కులాల వారీగా జనాభా ఎంత మంది ఉన్నారనేది బహిర్గతం చేయాలన్నారు. ఓబీసీ లెక్కలు కూడా తేల్చాల్సిన అవసరం ఉందన్నారు.

### 42 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

**హిరమండలం:** మండలంలోని కోదూరు గిరిజన గ్రామంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తంగి అమ్మన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు ఐశ్వర్య, ఇతర సిబ్బంది సేవలందించారు. మొత్తం 41 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మారుమూల గ్రామం కావడంతోనే ప్రజారోగ్యం దృష్ట్యా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ అధ్యక్షుడు తంగి రమేష్ తెలిపారు. జెమ్స్ పీఆర్వో దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

**ఎల్.ఎన్.పేట:** విద్యార్థుల సంక్షేమానికి, విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తానని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు సోమవారం పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. కాలేజీలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి విద్యార్థులు తీసుకువెళ్లారు. సమస్యలను పరిష్కరించుకునేందుకు తనవంతు విరాళంగా తక్షణమే రూ.లక్ష ఇస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ గిరిబాల, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**గెస్ట్ ఫ్యాకల్టీ సమస్యలు పరిష్కారించాలి**

ఎల్.ఎన్.పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న తమ సమస్యలను పరిష్కారించాలని కోరుతూ ఎమ్మెల్యేకు గెస్ట్ ఫ్యాకల్టీ అధ్యాపకులు ఆర్.ప్రభాకరరావు, సి.హెచ్.పాపారావు వినతిపత్రం అందజేశారు. నెలంతా పనిచేసినా రూ.10 వేలకు మించి రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పనికి తగ్గ వేతనం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్.హర్షవర్ధన్, జి.హరిబాబు, డి.ఇందిరా, యామిని, నాగమణి తదితరులు ఉన్నారు.

**పాఠ్యపుస్తకాల పంపిణీ**

**హిరమండలం:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ విద్యార్థులకు పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సోమవారం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ పట్నాయక్, తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ స్వరూపారాణి, ఎంఈఓ రాంబాబు, ప్రత్యేక ఆహ్వానితుడు తూలుగు తిరుపతిరావు, జెడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

### నగదు ప్రోత్సాహకం

**కొత్తూరు:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరంలో (2023-24) అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు రామరాజు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పారిశెల్లి రామ రాజు సమకూర్చిన నగదు పురస్కారాలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సోమవారం అందజేశారు. ప్రతీ ఏడాది ఈ విధంగా విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్న ట్రస్టు చైర్మన్‌ను అభినందించారు. కొత్తూరు, నివగాం ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు.

# దర్జాగా.. కబ్జా

- ఆర్అండ్‌బీ స్థలాల ఆక్రమణ
- చోద్యం చూస్తున్న అధికారులు



సరుబుజ్జిలి వద్ద ఏజీ రోడ్డులో వేసిన పందిరిలు, నిర్మాణాలు

**సరుబుజ్జిలి:** కాదేదీ కబ్జాకు అనర్హం అన్నట్లు ఆమదాలవలస నియోజకవర్గంలో వ్యవహారం జరుగుతుంది. ఖాళీజాగా కనిపిస్తే చాలు వేసేయ్‌పాగా అన్నచందంగా వ్యవహరిస్తున్నారు. ఆమదాలవలస పట్టణంలో కృష్ణాపురం జంక్షన్ నుంచి గేట్ వరకు రహదారులపై చాలావరకు దుకాణాలు పెట్టి ఆక్రమణలు చేశారు. ఆమదాలవలస రూరల్ మండలం జొన్నవలస, సరుబుజ్జిలి మండలంలో సరుబుజ్జిలి జంక్షన్, సవలాపురం జంక్షన్, రొట్టవలస వద్ద, పొందూరు మండలం రాపాక, లోలుగు ప్రాంతాల్లో ఆర్అండ్‌బీ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. రహదారులు పూర్తిగా కుచించుకుపోయి ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయిరు. ఇరుకైన రహదారుల్లో భారీ వాహనాలు ప్రయాణాలు చేసే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

**తొలిత ఆక్రమణ.. ఆపై విక్రయం..**

ఆక్రమణ చేసే ముందుగా తాత్కాలిక పాకలు, దుకాణాలు ఏర్పాటు చేసి.. తదుపరి పక్కా భవనాలు నిర్మాణాలకు తెగబడుతున్నారు. రహదారుల్లో కొంతమంది మురుగు కాలువలను ఆక్రమించి వాటిపై పక్కా భవనాలు నిర్మాణాలు చేయడం వలన వర్షాలు పడే సమయంలో మురుగునీరు నిల్వ చేరి ప్రజలు అవస్థలుపడుతున్నారు. నిబంధనల ప్రకారం ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపులా కొంత స్థలం విడిచిపెట్టి నిర్మాణాలు చేయాలి. ఇక్కడ మాత్రం ఈ నిబంధన వర్తించడంలేదు. కొంతమంది ఆర్అండ్‌బీ స్థలాల్లో తాత్కాలిక నిర్మాణాలు చేసి ఇతరులకు అనధికారంగా విక్రయించడం, షాపులు అద్దెలకు ఇస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



జగన్నాథపురం-సరుబుజ్జిలి రోడ్డు అంచువరకు ఉన్న దుకాణాలు, ఇతర నిర్మాణాలు

**చర్యలు తీసుకుంటాం..**

ఇదే విషయమై ఆర్అండ్‌బీ జేఈ ఎం.ఎం ఆంజనేయనాయక్ వద్ద ప్రస్తావించగా.. రహదారులను వెంటనే పరిశీలన చేసి, ఆక్రమణదారులకు నోటీసులు అందిస్తాం. ఆక్రమణలు చేపట్టినట్లు రుజువైతే తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## కాలిబాటలతో తెగుళ్ల నివారణ



చొర్లంగి వద్ద కాలిబాటలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

**ఎల్.ఎన్.పేట:** వరి పంటలో కాలిబాటలు వేయడం వల్ల అనేక తెగుళ్లను నివారించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి పైడి లతశ్రీ అన్నారు. మండలంలోని చొర్లంగి గ్రామంలో సోమవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పంటలో రైతులతో కలిసి కాలిబాటలు వేయించారు. కాలిబాటలను తూర్పు, పడమర దిశగా వేయాలన్నారు. 20 సెంటీ మీటర్ల వెడల్పుతో రెండు మీటర్లుకు ఒక కాలిబాట వేయాలని సూచించారు. కాలిబాటలు వేయటం వల్ల వరి దుబ్బులకు గాలి, వెలుతురు తగిలి మొక్కలు ఏపుగా పెరగడంతోపాటు పిలకల సంఖ్య పెరుగుతుందన్నారు. ఎరువులు వేసుకునేందుకు, పురుగు మందులు పిచికారీ చేసేందుకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. ఎరువులు, సాగునీటి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. సచివాలయ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## భారీ వాహనాలతో ఇబ్బందులు



కాలేజీ రోడ్డులో వస్తున్న లారీ



లారీ వెనుక నిలిచిన వాహనాలు

**నరసన్నపేట:** నియోజకవర్గ కేంద్రం నరసన్నపేటలో రద్దీ సమయాల్లో కూడా భారీ వాహనాలు, లారీలు ఇరుకు రహదారుల్లో వస్తుండటంతో ఇతర వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ప్రధానంగా బజారు వీధి, కాలేజీ రోడ్డు, బొంతల వీధి, పెద్దపేట, జోగిపేట కూడలి రోడ్లుపై లారీలు వస్తుండటంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఇటువంటి వాహనాలను ఉదయం 10 గంటల లోపు మాత్రమే అనుమతించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ వీధుల్లో రోడ్లుపైనే తోపుడు బళ్ల వ్యాపారం, కూరగాయల వ్యాపారం జరుగుతుండటంతో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. లారీలు వస్తుండటంతో గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయి. పంచాయతీ, పోలీసులు సిబ్బంది గమనించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## తాగునీరు వృథా



లక్ష్మీనర్సుపేట రోడ్డు పక్కన వృథాగా పోతున్న తాగునీరు

**ఎల్.ఎన్.పేట:** మండలంలోని 36 గ్రామాలకు తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన మెగా రక్షిత తాగునీటి పథకానికి లీకుల బెడద పట్టిపీడిస్తుంది. లక్ష్మీనర్సుపేట గ్రామ సమీపంలోని వంశధార నదీ తీరంలో నిర్మించిన మెగా రక్షిత తాగునీటి పథకం నుంచి పలు గ్రామాలకు తాగునీరు అందించేందుకు భూ గర్భంలో ఏర్పాటు చేసిన పైపులైన్లు నిత్యం లీకులు అవుతూనే ఉన్నాయి. లీకుల కారణంగా తాగునీరు అందటం లేదని పలువురు ఆందోళన చెందుతున్నారు. లీకులు లేకుండా శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు, సర్పంచ్‌లు కోరుతున్నారు.


## ప్రమాదం అంచున ప్రయాణం



ఆటో వెనుక కూర్చొని ప్రయాణిస్తున్న విద్యార్థులు

**పాతపట్నం:** వరుసగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా ఆటోవాలల తీరు మారడం లేదు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి ప్రమాదాలకు కారణమవుతున్నారు. విద్యార్థులను సైతం కుక్కి పాఠశాలలకు తీసుకెళ్తున్నారు. ఆటోలు ఏ మాత్రం అదుపు తప్పినా విద్యార్థులకు ముప్పు తప్పదు. పాతపట్నం, గంగువాడ, సీది, తెంబూరు, తిడ్డిమి, సరాలి, పర్లాకిమిడి ప్రాంతాల్లో ఆటో ప్రయాణం ప్రమాదకరంగా మారుతుంది. బస్సు సౌకర్యం ఉన్నప్పటికీ.. గమ్య స్థానానికి వేగంగా వెళ్లాలనే ఆత్రుతతో విద్యార్థులు, కార్మికులు ఆటోల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇక్కడ వ్యాపారం, విద్య, ఉద్యోగం నిమిత్తం వందల సంఖ్యలో మండల కేంద్రానికి ప్రతిరోజూ ప్రజలు రాకపోకలు సాగిస్తారు. పని ముగించుకుని ఇంటికి వేగంగా వెళ్లాలన్న ఆలోచనతో ఆటోల్లో ప్రయాణం చేస్తున్నారు. ఇదే అదునుగా భావించి ఆటోవాలాలు ప్రయాణికుల అవసరాలను అనువుగా తీసుకుని క్యాష్ చేసుకుంటున్నారు. ప్రధానంగా పాతపట్నంలో 16 వరకు విద్యా సంస్థలు ఉన్నాయి. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం ఆటోల్లో ఆయా పాఠశాలలకు, కళాశాలలకు వేల సంఖ్యలో విద్యార్థులు వస్తూ, వెళ్తుంటారు. పరిమితికి మించి ప్రయాణాలపై అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### జలకళ..



పాతపట్నం మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు తెంబూరు ఆసర్ల సాగరం కళకళలాడుతుంది. రైతులకు ఆనందం పంచనుంది. పంట పొలాలను సస్యశ్యామలం చేయనుంది. ఆసార్లసాగరం నిండితే పాతపట్నం, టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాల్లో సూమారు 2,600 ఎకరాలకు పైగా పంట భూములకు నీరు అందుతుంది. 750 ఎకరాల విస్తీర్ణం కలిగిన అసర్ల సాగరం నుంచి ఇప్పటికే ఒక స్లూయిజ్ ద్వారా పంట పొలాలకు నీరు వెళ్తుంది. అసర్ల సాగరాన్ని రిజర్వాయర్‌గా స్థాయికి పెంచితే ఈ పరిసర ప్రాంత ప్రజలు ఏడాది పొడవునా పంటలు పండించుకునేందుకు సాగునీరు అందుబాటులోకి వస్తుంది రైతులు అంటున్నారు.

– పాతపట్నం

### ఇంటింటా ఫీవర్ సర్వే



ఫీవర్ సర్వే చేస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది

**సరుబుజ్జిలి:** ఆరోగ్య సూత్రాలు పాటించడం వల్ల సీజనల్‌గా వచ్చే వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చునని సీహెచ్ఓ మోహన్‌రావు తెలిపారు. ఆరోగ్య సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో గల నందికొండ కాలనీలో ఇంటింటా సోమవారం ఫీవర్ సర్వే చేశారు.

### సుప్రీం తీర్పుపై నిరసన



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దళిత మహాసభ నాయకులు

**కొత్తూరు:** ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంపై కొత్తూరు నాలుగు రోడ్ల కూడలిలో మండల దళిత మహాసభ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా దళిత సంఘం అధ్యక్షుడు బొంపల తిరుపతిరావుతోపాటు పలువురు మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పుపై మారోసారి సమీక్ష జరపాలని కోరారు. ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పడాల నాగభూషణరావు, బి.రామకృష్ణ, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

### శ్రీనందం సుబ్బారావు స్వామి కన్నుమూత



సుబ్బారావు స్వామిజీ(ఫైల్)

**ఆమదాలవలస:** ఆమదాలవలస మండలంలోని గాజులకొల్లివలస గ్రామ సమీపంలో అతి ప్రాచీనమైన సంగమేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో గత 43 ఏళ్లుగా భక్తులకు, సాధకులకు ఆధ్యాత్మిక మార్గంలో దిశానిర్దేశం చేసి అందరి మన్ననలు పొందిన సుబ్బారావు స్వామిజీ (84) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈయన 1981లో సంగమేశ్వర కొండపై ఒక చిన్న కుటీరం నిర్మించుకున్నారు. ఆయన జీవన శైలిని గమనించిన కొంత మంది శిష్య బృందం వారికి కొండ దిగువన శాశ్వత భవనాన్ని నిర్మించారు. 2005 నుంచి అక్కడే నివాసం అంటున్నారు. పరిసర ప్రాంతాల్లో భక్తుల కోరిక మేరకు వారి ఇళ్లకు వెళ్లి వారుపెట్టిన ఆహారాన్ని స్వీకరించి తిరిగి ఆశ్రమానికి వచ్చేవారు. ఈయన స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం. అంత్యక్రియలు సంగమేశ్వర ఆలయ ప్రాంతంలో నిర్వహించారు.

### గండిని పూడ్చండి..



గండిని తాత్కాలికంగా పూడ్చుతున్న రైతులు

**ఆమదాలవలస:** సంతకవిటి మండలంలోని గారన్నాయుడుపేట దగ్గర సాయన్న గెడ్డకు ఇటీవల పడిన గండిని నీటిపారుదల శాఖ, సంబంధింత అధికారులు తక్షణమే పూడ్చాలని ఆమదాలవలస మండలం బెలమాం, లొద్దలపేట, పొందూరు మండలం గంగ్రేడు తదితర గ్రామాల రైతులు కోరుతున్నారు. ఆగస్టు మొదటి వారం వచ్చినా నీరు అందక రైతులు అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సోమవారం ఆయా గ్రామాల ప్రజలు ట్రాక్టర్లపై వెళ్లి గండి పూడ్చే ప్రయత్నం చేశారు.

## ప్రజా సమస్యలపై పోరాటాలు చేద్దాం



మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

**సరుబుజ్జిలి:** సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరే వరకు అందరం కలిసికట్టుగా పోరాటాలు చేద్దామని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సోమవారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరికీ భూ హక్కు కల్పించే ల్యాండ్‌టైటిల్ యాక్ట్‌ను అవగాహన లేకుండా ఈ ప్రభుతవం రద్దు చేసిందన్నారు. రూ.2 కోట 74 లక్షలను పలు పథకాల ద్వారా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందించామని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు అలవికాని పథకాలు పెట్టి ఇప్పుడు ఖజానా ఖాళీ అయిందని మొసలికన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్ పథకాలకు చేతులెత్తే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఇసుక ధరలు అమాంతం పెంచి ఉచితమని చెప్పడం సిగ్గుచేటన్నారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని, అర్ధ రాత్రి పిలిచినా తాను సిద్ధంగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ప్రజాక్షేత్రంలో మరింత ఉత్సాహంతో దూసుకుపోవాలని పిలుపునిచ్చారు. టీడీపీ ప్రభుత్వం చేస్తున్న రాక్షస పాలనకు చరమ గీతం పాడేవరకు అందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు సత్యనారాయణ, వైస్ ఎంపీపీ శివానంద మూర్తి, జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, మూడడ్ల రమణ, పేడాడ చిరంజీవి, బద్రి రామారావు, ప్రకాశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### స్వీపర్లు, సిబ్బంది ధర్నా



ఆందోళన చేస్తున్న స్వీపర్లు, జీసీపీ సిబ్బంది

**కొత్తూరు:** మండలంలోని వసప గ్రామం వద్ద స్టేట్ వేర్ హౌస్ గొదాంలో పనిచేస్తున్న స్వీపర్లు, జీసీపీ సిబ్బంది సోమవారం ధర్నా చేపట్టారు. ఐదేళ్లుగా గొదాంలో పనిచేస్తున్నామని, ఏ తప్పు లేకుండా తమను విధుల నుంచి తొలగించడం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వచ్చిన సిఫార్స్ మేరకే గొదాం మేనేజర్ తమను విధుల నుంచి తొలగించారని ఆరోపించారు. కొత్తవారిని నియమించాలని గొదాం మేనేజర్‌కు ఎమ్మెల్యే లెటర్ ద్వారా ఆదేశించి తమ పొట్ట కొట్టారన్నారు. న్యాయం జరిగే వరకు గొదాం ముందు ఆందోళన కొనసాగిస్తామన్నారు.

### ముమ్మరంగా వరి నాట్లు



గుండవల్లిపేట వద్ద వరి నాట్లు వేస్తున్న మహిళా కూలీలు

**నరసన్నపేట:** మండలంలోని పలు గ్రామాల్లో వరి నాట్లు ముమర్మంగా వేస్తున్నారు. వర్షాలు అందిరావడం, కాలువల ద్వారా నీరు వస్తుండటంతో వ్యవసాయ పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు.

నరసన్నపేట, కరగాం, గొట్టిపల్లి, రెడ్డికిపేట, జమ్ము, తామరాపల్లి, మడపాం, బొరిగివలస, రావులవలస, గుండవల్లిపేట, లకిమేర, సత్యవరం తదితర గ్రామాల్లో వరి నాట్లు వేస్తున్నారు. మిగిలిన గ్రామాల్లో వరి పంటను వెద పద్ధతిలో సాగు చేస్తున్నారు. మండలంలో 80 శాతం మేర వరి నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయాధికారి కె.సునీత తెలిపారు. మరో పది రోజుల్లో ఉభాలు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు.

## సామూహిక సీమంతం



నరసన్నపేట: సామూహిక సీమంతం నిర్వహిస్తున్న సర్పంచ్, తదితరులు

**నరసన్నపేట:** మండలంలోని మడపాం గ్రామంలో గర్భిణులకు సామూహిక సీమంతాలను సోమవారం నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. సూపర్‌వైజర్ అల్లు రమణమ్మ తల్లిపాల ప్రాధాన్యతను వివరించారు. సర్పంచ్ ఎరుకోడు, ఎంపీటీసీ రువ్వ వాసు, వీఆర్వో సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి, ఐసీడీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

**సారవకోట:** మండలంలోని చీడిపూడి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమంలో పీహెచ్ఎన్ పార్వతి పాల్గొన్నారు. పుట్టిన పిల్లలకు వెంటనే ముర్రుపాలు పట్టాలని, దీంట్లో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందన్నారు. సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

**పాతపట్నం:** మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఎదురుగా ఉన్న బీసీ కమ్యూనిటీ హాల్‌లో సీడీపీఓ టి.విమలారాణి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలను సోమవారం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన పౌష్టికాహారంలో భాగంగా పలు పిండి వంటల ప్రదర్శనను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తిలకించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. కళాశాలకు రెండు కంప్యూటర్లను అందజేస్తామని హామీ ఇచ్చారు.

### పాఠ్య పుస్తకాల పంపిణీ



సరుబుజ్జిలి: రొట్టవలసలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

**సరుబుజ్జిలి/బూర్జ/ఆమదాలవలస:** విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస మహిళా జూనియర్ కళాశాల, బూర్జ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### ఆర్పీలకు గౌరవ వేతనం పెంచాలి

**ఆమదాలవలస:** స్వయం శక్తి సంఘాలను బలోపేతం చేస్తూ నిరంతరం శ్రమిస్తున్న ఆర్పీలకు గౌరవవేతనం పెంచాలని కోరుతూ ఆమదాలవలస మున్సిపల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. మెప్మా నుంచి రూ.8 వేలు, సమాఖ్యల నుంచి రూ.2 వేలు మొత్తం రూ.10 వేల గౌరవ వేతనం పొందుతున్నామని ఆర్పీలు తెలిపారు. శ్రమకు తగిన ఫలితం ఇవ్వాలని వారంతా కోరారు.